క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో పవర్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒకటో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఎన్టీపీసీకి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. సమీక్షా సాహు రెండు బంగారు పతకాలు, టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, కె.కె.ఎస్ సాత్విక్ బంగారు పతకం, రాగి పతకాలను కై వసం చేసుకున్నారు. పి.అభి రజత పతకం, డి.ప్రియాన్స్ వెండి పతకం, పి.అజయ్‌కుమార్ వెండి, రాగి పతకం, ఎస్.క్యాతినాథ్ రెండు బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. పోటీల్లో మాస్టర్లు జి.పుష్పారావు, ఎం.తులసీరావు, గొర్లి వంశీ పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: ఏపీ ట్రాన్స్‌కో సీలేరు–గాజువాక హెచ్‌టీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్నయ్యపాలెం సమీపంలోని టెరకాన్ లే అవుట్స్ వద్ద ఈ నిర్వహణ పనులు చేపట్టడంతో 11కేవీ సబ్బవరం టౌన్,రూరల్ ఫీడర్స్ ఎల్‌సీ లైన్స్ క్లియరెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెం,చిన్నయ్యపాలెం,తవ్వావానిపాలెం,అమృతపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

పలు ప్రాంతాల్లో ప్రధాని పుట్టినరోజు వేడుకలు



నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గొర్లె రామునాయుడు

సింహాచలం: ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకలను బీజేపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి కూడలిలో మోదీ చిత్రపటానికి రామునాయుడు, బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మట్టి ప్రతిమలు అందజేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ రక్షణ రంగాన్ని పటిష్ట పరిచిన ఘనత మోదీదే అని ప్రశంసించారు.

పరవాడ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ముత్యాలమ్మపాలెంలోని మాధవిస్వామి ఆలయంలో యువ మోర్చా అధ్యక్షుడు మోస రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.నూకరాజు, అప్పలరాజు, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘మట్టి’మేలు తల పెట్టవోయ్..

- చవితి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు
- వాడవాడలా సిద్ధమైన మండపాలు
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు
- మట్టి విగ్రహాల వైపే మొగ్గు చూపుతున్న ప్రజానీకం



సింహపురికాలనీలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు తదితరులు



అడవివరంలో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న కర్రి అప్పలస్వామి



తొలిపావంచా వద్ద మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవకమిటీ సభ్యులు

సింహాచలం: వినాయక చవితి వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఊరూ వాడా సిద్ధమైంది. సోమవారం వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఏడాదిలో వచ్చే తొలిపండుగ కావడంతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ప్రతీ ఇంటా వినాయక విగ్రహాలను పెట్టి శక్తి కొలదీ పూజలు చేసేందుకు ప్రజానీకం సిద్ధమయ్యారు. పూజాసామగ్రి కొనుగోలు దారులతో ఆదివారం ఎస్‌ఏడీ కూడలిలో మార్కెట్ సందడిగా కనిపించింది. బాజీ సెంటర్‌లో గణపతి విగ్రహాల విక్రయం జోరుగా సాగింది. ప్రత్యేకంగా మండపాలను తీర్చిదిద్దారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. పెద్ద ఎత్తున మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మార్కెట్‌లో కూడా మట్టి విగ్రహాల కొనుగోలు చేసేందుకే ప్రజానీకం ఆసక్తి చూపారు.

మట్టివినాయ ప్రతిమల పంపిణీ

సింహాచలం: వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం వాడవాడలా మట్టి గణనాథుడి ప్రతిమల పంపిణీ చేశారు. జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీ ప్రధాన ఆర్చి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల అప్పలరాజు ఆధ్వర్యంలో మూడువేల వినాయక ప్రతిమల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింహపురికాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వరరావు, సెక్రటరీ మురళీబాబు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

- అడవివరంలోని కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ భవనం వద్ద కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలు, తులసి మొక్కలను ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అందజేశారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి సత్తిబాబు పాల్గొన్నారు.
- అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ సేవా సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: విద్యార్థులు చదువుతో పాటు కరాటే అభ్యసించడానికి ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెన్నలపాలెంలోని సింహాద్రి కల్యాణ మండపంలో రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభా వంతులను వెలుగులోకి తీసుకురావడానికి ఈ కరాటే పోటీలు దోహదపడతాయన్నారు. కరాటే మహిళల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుందన్నారు. తమ పిల్లలకు కరాటే నేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, కలపాక సర్పంచ్‌లు కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, చింతకాయల సుజాత ముత్యాలు, బొండా కనకారావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, కరాటే చీఫ్ ఆర్గనైజర్ ఒలిశెట్టి ప్రసాద్, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మార్కెట్లు

సింహాచలం: వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుచేసే వారితో ఆదివారం మార్కెట్లు కిక్కిరిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పూజాసామగ్రి కొనుగోలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆయా మార్కెట్లు కిటకిటలాడాయి. అడవివరం మార్కెట్ కూడలి, వేపగుంట కూడలి, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, సుజాతనగర్, చినముషిడివాడ, శారదాపీఠం మార్గం, పెందుర్తి రైతు బజార్, పెందుర్తి కూడలిలో పెద్ద ఎత్తున పూజాసామగ్రి, పత్రి విక్రయాలు జరిపారు.

వాడవాడలా వెలసిన వేదికలు

వినాయక చవితి పురస్కరించుకుని అడవివరం, వేపగుంట, నాయుడుతోట, పురుషోత్తపురం, చినముషిడివాడ, పెందుర్తి, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, పెందుర్తి గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేదికలను ఏర్పాటు చేశారు. అడవివరం ఆయిల్‌మిల్ వద్ద గణేష్‌యువజన సేవా సంఘం, బంగారమ్మ గుడి వీధిలో శ్రీనివాసా యూత్ ఫ్రెండ్స్ ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేశారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం!



మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం నెలరోజులుగా మూతపడడంతో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పరిసర గ్రామాలకు చెందిన బ్యాంకు ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ఏటీఎం పని చేయకపోవడంతో బ్యాంకు లావాదేవీలు జరపడానికి దీపాంజలినగర్, పరవాడ ప్రాంతాల్లోని ఏటీఎంలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల అవస్థలను గుర్తించి వాడచీపురుపల్లి కూడలిలోని ఏటీఎం సెంటర్‌ను వినియోగంలో తీసుకురావడానికి బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు. సాంకేతిక పరమైన మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదించామని వాడచీపురుపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ జి.కె.కిరణ్‌కుమార్ చెప్పారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

అన్నప్రసాదం ఎలా ఉంది?

భక్తులను అడిగి తెలుసుకున్న ఈవో శ్రీనివాసమూర్తి



అన్నప్రసాద భవనంలో పరిశీలన చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి అన్నప్రసాదం నాణ్యత ఎలా ఉందని స్వయంగా భక్తులనే దేవస్థానం కొత్త ఈవో శ్రీనివాసమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన అన్నప్రసాద భవనంలోకి వెళ్లి అన్న ప్రసాదం తయారీ విధానాన్ని పరిశీలించారు. నాణ్యత ఎలా ఉందని స్వయంగా భక్తులనే అడిగి తెలుసుకున్నారు. ఏఈవో రమణమూర్తి, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఉన్నారు.

నిబంధనలకు లోబడే వినాయక ఉత్సవాలు

- మేహాద్రిగెడ్డ, రాంపురం చెరువుల్లో నిమజ్జనం నిషేధం
- పెందుర్తి సీఐ శ్రీనివాసరావు



నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సింహాచలం: వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. వినాయక ఉత్సవ కమిటీలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మండపం బాధ్యత తీసుకునే వారి పేరు, ఆధార్ నెంబరు, అడ్రస్ పోలీసులకు అందజేయాలన్నారు. లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిమజ్జనాన్ని చేయాలని సూచించారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో ఎవరో ఒకరు కాపాలాగా ఉండాలన్నారు. పోలీసులు సూచించిన చెరువుల్లోనే నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా మేహాద్రిగెడ్డ, రాంపురం చెరువుల్లో నిమజ్జనాన్ని నిషేధించడం జరిగిందన్నారు. సరిపల్లి, కోటనరవ, పినగాడిలో ఉన్న చెరువుల్లో మాత్రమే నిమజ్జనానికి అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అసిరి తాత, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి శిరీష తదితరులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శిరీష విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు చందు,హర్ష,మౌళి దీక్షిత,చంద్రిక కుసుమ తదితరులు పాల్గొన్నారు.



సాలాపువానిపాలెంలో విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సాలాపువానిపాలెంలో..

పరవాడ: సాలాపువానిపాలెంలో విశ్వకర్మ జయంతి వేడుకలను స్థానిక విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొమ్మోజు కృష్ణ, ఉపాధ్యక్షుడు అలమండ చంద్రశేఖర్, కార్యదర్శి ముదపాక ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం

సబ్బవరం: మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని గొంప ముత్యాలనాయుడు కోరారు.స్థానిక సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఆయన 1,000 మట్టి విగ్రహాలను ఆదివారం భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్బవరపు నాగేంద్ర కుమార్, గొర్లి పైడంనాయుడు, ఎం. రామకృష్ణ,రెడ్డి రాము,బడిశాల యూత్ సభ్యులు గెడ్డం దుర్గారావు, గెడ్డం రమేష్,సురేష్ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ముత్యాలనాయుడు తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు నారాయణమూర్తి, కె.సంతోష్, కేవీఆర్ లక్ష్మి, దొడ్డి పద్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.